దగా బడ్జెట్

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్నివర్గాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులతో సూపర్ సిక్స్ అమలు సాధ్యం కాదని పేర్కొంటున్నారు. వంచనకు నిలువుటద్దంగా బడ్జెట్‌ను అభివర్ణిస్తున్నారు.

– శ్రీకాకుళం పీఎన్‌కాలనీ

బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులే లేవు



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారు. 50 ఏళ్ల వయస్సు గల బీసీలకు పెన్షన్ ఇస్తామన్న హామీకి రూపాయి కూడా కేటాయించలేదు. వైఎస్ జగన్ బీసీలకు పెద్దపీట వేసేవారు.

– మామిడి శ్రీకాంత్,
తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు

సూపర్ సిక్స్ హామీలకు 'చిల్లు'



వార్షిక బడ్జెట్ అంతా అంకెల గారడీ. మరోసారి చంద్రబాబు తన మోసపూరిత నైజాన్ని చాటుకున్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లో భారీగా లబ్ధిదారులను కోత పెట్టడానికి చూస్తున్నారు. ఆడబిడ్డ నిధి కింద 19 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైంది.

– దుంపల రామారావు,
రాష్ట్ర మాజీ కళింగ కార్పొరేషన్ చైర్మన్

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు



ఓ కేంద్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్న దృశ్యం

- జిల్లాలో 75 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 40356 మంది విద్యార్థులు
- 1480 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు..

జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురైనా 08942-295933 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఆర్‌ఐఓ పి.దుర్గారావు పేర్కొన్నారు.

నో సెల్‌ఫోన్ జోన్లుగా పరీక్ష కేంద్రాలు..



ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నో సెల్‌ఫోన్ జోన్‌లుగా ప్రకటించింది. విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లు, సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, స్క్వాడ్‌లు, చివరకు తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు పరీక్ష కేంద్రం వెలుపలే ఉంచాల్సి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో సందేహాలు, అధికారులకు సమాచారం అందజేత, ఇతరత్రా అవసరాల నిమిత్తం కేంద్రానికి ఒకటి చొప్పున కీప్యాడ్ ఫోన్లను, సిమ్‌లను అధికారులు అందజేశారు. ఇవి సీఎస్‌ల పర్యవేక్షణలో ఉండనున్నాయి.

గత ప్రభుత్వం ముందుచూపు..



గత ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించి నాడు-నేడు ద్వారా కళాశాలల్లో సైతం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించింది. అత్యాధునిక ఫర్నిచర్, తాగునీటి ఆర్వో ప్లాంట్, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్‌కు చర్యలు ఇలా అన్ని వసతులు సమకూర్చారు. గత ప్రభుత్వ చొరవను, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టిని ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి మొదలుకానున్న థియరీ పబ్లిక్ (ఐపీఈ మార్చి-2025)పరీక్షలకు ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒకటో తేదీన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు/సంస్కృతం/హిందీ పేపర్లతో పరీక్షలు మొదలుకానున్నాయి. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచల మేరకు జిల్లా స్పెషల్ ఆఫీసర్/డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు ఆధ్వర్యంలో ఆర్‌ఐఓ ప్రగడ దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు ఎస్.భీమేశ్వరరావు, పీవీఎల్ నారాయణ, జి.సింహాచలం, ఇతర అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. 8.30 నుంచి పరీక్ష కేంద్రంలోపలికి అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టంచేస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తున్నారు.

- జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 75 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలే అధికం. 40356 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జనరల్ విద్యార్థులు 37,956 మంది, ఒకేషనల్ 2380 మంది ఉన్నారు. ప్రథమ సంవత్సరం 20389 మంది, ద్వితీయ సంవత్సరం 19967 మంది ఉన్నారు.
- పరీక్ష నిర్వహణకు 75 మంది చొప్పున సీఎస్‌లు, డీవోలు, 31 మంది కస్టోడియన్లను నియమించారు. 4 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 1650 మంది ఇన్విజిలేటర్లను వినియోగిస్తున్నారు. ఆర్డీవోలు సైతం డివిజన్‌ల వారీగా పర్యవేక్షించనున్నారు.
- జిల్లాకు ఇప్పటికే మూడు సెట్లతో కూడిన ప్రశ్నపత్రాలు 31 స్టోరేజ్ పాయింట్లలో బందోబస్తు నడుమ భద్రపరిచారు.
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. మెడికల్ సిబ్బందితో ప్రాథమిక చికిత్సను కిట్లను అందుబాటులో ఉంచుతున్నారు.
- పరీక్ష కేంద్రాల్లో 1480 సీసీ కెమెరాలతో నిఘాతోపాటు వాటిని ఇంటర్‌బోర్డు, జిల్లా ఆర్‌ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానం చేశారు.
- కొన్ని ప్రత్యేక రూట్లలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. హాల్‌టికెట్ చూపితే పరీక్ష కేంద్రాలకు ఉచితంగా బస్సు ప్రయాణం చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
- పరీక్ష జరుగుతున్న సమయంలో సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు.
- సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, బ్లూటూత్, డిజిటల్ వాచ్‌లు, పేజర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలకు అనుమతించరు.
- హాల్‌టికెట్‌పై ఫోటో తప్పనిసరి. హాల్‌టిక్కెట్‌లో పొందుపర్చిన సూచనలను విధిగా పాటించాలి. దానిపై ఎలాంటి రాతలు ఉండకూడదు.

కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాం



విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశానుసారం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది సహకరించి విజయవంతం చేయాలి.

– శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ పరీక్షల జిల్లా స్పెషల్ ఆఫీసర్, జిల్లా డీవీఈఓ

పకడ్బందీగా ఏర్పాట్లు



ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్‌బోర్డు సెక్రటరీ, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు పరీక్షల నిర్వహణపై ఎప్పటికప్పుడు సీఎస్‌లు, డీవోలతో సమీక్షిస్తున్నాం.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు, జిల్లా ఆర్‌ఐఓ, డీఈసీ కన్వీనర్

క్లుప్తంగా

ఇన్ఫోసిస్‌కు 12 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్స్‌కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న 12 మంది విద్యార్థులు ఇన్ఫోసిస్ క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.2.2లక్షల వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు ఉంటాయని ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ తెలిపారు. వీరిని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, ఆర్.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

2న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 2న ఆనందోబ్రహ్మ, స్పిరిట్యువల్ టాబ్లెట్స్ సంయుక్త ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ధ్యాన ఆరాధన ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పలువురు కళాకారులు త్యాగరాజ స్వామి కృతుల ఆలాపన, ధ్యానం చేస్తారని పేర్కొన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు కోసమే..

రణస్థలం: కోష్ట పంచాయతీలో ఐదేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బురద జల్లుతున్నారని, శ్మశాన వాటికకు రహదారి కోసమే మట్టి వేస్తున్నానని టీడీపీ నాయకుడు పిసిని జగన్నాథం తెలిపారు. ఈ మేరకు కృష్ణమ్మ చెరువు వద్ద శుక్రవారం అధికారులతో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. 'అంతా నా ఇష్టం' శీర్షికన ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

సమస్యల పరిష్కారానికి హామీ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం హామీ ఇచ్చిందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రెండో డిపో అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎస్.బాబు, వై.డి.రావు, ప్రతినిధి కె.బాబూరావు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఈయూ నాయకులు బి.ఆర్.కృష్ణ, బి.శేషుబాబు, కె.సూర్యప్రకాష్, ఆర్.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల స్నానం



నాగావళి నదిలో త్రిశూలస్నానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమా జఠలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిశూల స్నానం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా నాగావళి నదికి తీసుకెళ్లారు. అక్కడ ఉత్సవ మూర్తులను నదిలో ఉంచి త్రిశూల స్నానాలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూసర్వే చేయాలని వినతి

జి.సిగడాం: మెట్టవలస గ్రామంలో భూ రీ సర్వే చేసి రైతులను ఆదుకోవాలని సర్పంచ్ కామెజుల సీతారాం, ఎంపీటీసీ సభ్యులు బెవర జగన్నాథం కోరారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ ఎం.శ్రీకాంత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. భూరికార్డుల్లో అవకతవకలు జరగడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ శాంతారావు, ఈశ్వరరావు, వీఆర్‌ఓ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నదిలో మృతదేహం కలకలం



బ్రిడ్జిపై నిలిచిన ట్రాఫిక్



నాగావళి నదిలో రాము మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఏడురోడ్ల కూడలి సమీప నాగావళి నదిలో ఓ వ్యక్తి మృతదేహం శుక్రవారం ఉదయం కలకలం రేపింది. మృతుడు తోటపాలెం జంక్షన్ నీలమ్మ కాలనీలోని ఓ షెడ్డులో నివసిస్తున్న యాదవరెడ్డి రాము(40)గా పోలీసులు గుర్తించారు. ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము నగరంలోనే ఓ పండ్ల దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు. మొదటి భార్య జయలక్ష్మి హడ్కో కాలనీలో, రెండో భార్య హైదరాబాద్‌లో ఉంటున్నారు. రాముకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో షెడ్డు వద్దే ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు నదిలో మృతదేహముందని పోలీసులకు సమాచారం రావడంతో ఏఎస్‌ఐ రమేష్, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. వంతెన పైనుంచి గురువారం రాత్రే నదిలోకి జారి పడి తలకు రాళ్లు తగిలి మృతి చెందివుంటాడని, సమీపంలో మద్యం బాటిళ్లు సైతం ఉండటంతో తాగి పడిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. అయితే నాలుగురోజులుగా కోటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లోనే రాము తిరుగుతున్నాడని, గురువారం రాత్రి 9:30 ప్రాంతంలో కూడా ఆలయ సమీపంలోనే ఉన్నాడని, ఆ తర్వాత ఎవరైనా తోసివుంటారేమో అన్న అనుమానాలు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మృతుని సోదరుడి కుమారుడు యాదవరెడ్డి వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రమేష్ పేర్కొన్నారు. కాగా, శుక్రవారం ఉదయం 8:30 ప్రాంతంలో ప్రాంతంలో విషయం బయటపడటంతో పాత వంతెన మీదుగా వెళ్లే వాహనదారులు మృతదేహాన్ని చూసేందుకు ఆగడంతో అరగంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది.

ఘనంగా సైన్స్ డే



సింగుపురంలోని క్రాంతి విద్యానికేతన్‌లో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ గుండ అమ్మడు

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పలుచోట్ల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ అవశ్యకతను ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు వివరించారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం/గార/ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల/రణస్థలం/జి.సిగడాం



ముద్దాడపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు



హయాతీనగరంలోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో..



శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్లో సైన్స్ డే వేడుకలు

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్ : పెదపాడులోని బాలికల అంబేడ్కర్ గురుకులంలో 2025-26 సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.రంగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలని కోరారు. 5వ తరగతిలో ప్రవేశపరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12గంటల వరకూ, ఇంటర్మీడియట్ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటలు వరకూ నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ 9493341737 నంబర్ సంప్రదించాలన్నారు.

వాండ్రంగిలో ఆక్రమణల గుర్తింపు



హద్దురాళ్లు వేస్తున్న రెవెన్యూ అధికారులు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగిలో భూ ఆక్రమణలను తొలగించాలని ఇటీవల గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించారు. గ్రామంలోని 213/2లో 12 ఎకరాల 49.సెంట్లు విస్తీర్ణం గల కంబాలవాని చెరువు, 152/2లో 1.49 సెంట్ల గోర్జిలో కొంత భూమి ఆక్రమణకు గురైందని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్‌కు ఫిర్యాదు ఇవ్వడంతో ఆర్‌ఐ ఆబోతుల రాధ, మండల సర్వేయర్ శాంతారావు, ఐకేపి సర్వేయర్ ఈశ్వరరావు, వీఆర్‌ఓ శివనారాయణ, సచివాలయం సర్వేయుర్ల సాయి, అప్పలరాజు సర్వే నిర్వహించారు. హద్దులను గుర్తించి గ్రామపెద్దల సమక్షంలో రాళ్లు వేశారు.

మిగతా ఆక్రమణలను పోలీస్ బందోబస్తు సమక్షంలో తొలగిస్తామన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



హౌర్వే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న టైలర్స్ అసోషియేషన్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్/పీఎన్ కాలనీ: శ్రీకాకుళం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌక్‌బజారు కూడలి వద్ద శుక్రవారం టైలర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ టైలర్స్ కో-ఆపరేటివ్ సొసైటీల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తులు వచ్చాక టైలర్స్ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. అనంతరం సోనీ టైలర్ కృష్ణ ఆరోగ్యకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు శ్రీనివాస పండా, అధ్యక్షులు వేణు, రాజు, కోశాధికారి కోరాడ తిరుమల, వెంకట్, మాలారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ఆ పాఠశాలకు పంపించం



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు

గార : శ్రీకూర్మం పొందర వీధిలోని తమ పిల్లలను శ్రీకూర్మనాథాలయం దాటి వేరే స్కూల్‌కు పంపించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు దామోదర హేమలత, ఉపాధ్యక్షురాలు తర్ల మణికుమారి, వార్డు మెంబర్ పాత్రుని దుర్గారావు అన్నారు. ఈ మేరకు విద్యార్థులను పాత పాఠశాలలోనే కొనసాగించాలని కోరుతూ గారలో ఎంఈవో-1 ఎన్.రామకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందించారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకటాపురంలో అభయాంజనేయ స్వామి ఆలయ 18వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, వావిళ్ల రామారావు, నెల్లి అమావాస్య, పతివాడ గురినాయుడు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీకూర్మంలో మాఘ అమావాస్య పూజలు

గార: ఆదికూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో మాఘ అమావాస్య పురస్కరించుకొని భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీసన్నిధిలో గోపినంబాళ్ల సల్లకూర్మన్నచార్యులు ఆధ్వర్యంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, నర్సుబాబు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా రోగులకు కిట్లు పంపిణీ

అరసవల్లి: జిల్లా కేంద్రంలోని ఆదివారంపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా(బోధకాలు) రోగులకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫైలేరియా మార్బులిటీ మేనేజ్‌మెంట్ కిట్లు (ఎఫ్ఎంఎం) పంపిణీ చేసారు. శుక్రవారం అర్బన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ వి.బాలమురళీకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, వైద్యాధికారి హరినాయుడు, పారా మెడికల్ అధికారి వాన సురేష్ పాల్గొన్నారు.

ఐదున్నర దశాబ్దాల ముచ్చట



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఒకప్పటి ఎంఎంపీ స్కూల్‌లో 1968-69 బ్యాచ్ 12వ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఖ్యాతి ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి సామగ్రిని వితరణ చేశారు. తమతో చదివిన స్నేహితులకు సాయం అందించారు. మృతి చెందిన స్నేహితులకు నివాళులు అర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

మరోసారి ఫ్లై ఓవర్ సర్వే



కొలతలు వేస్తున్న హైవే, రెవెన్యూ అధికారులు

రణస్థలం: రణస్థలం జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణానికి చేపట్టిన కొలతల్లో వ్యత్యాసాలు ఉన్న నేపథ్యంలో శనివారం మరోసారి సర్వే చేపడతామని హైవే సైట్ ఇంజినీర్ మహేష్ తెలిపారు. జె.ఆర్.పురంలో శనివారం మండల సర్వేయర్ ఎం.రవి, రెవెన్యూ సిబ్బందితో కలిసి రహదారిని పరిశీలించారు. పాత పెట్రోల్ బంకు నుంచి సూర్య స్కూల్ వరకు 1.4 కిలోమీటర్ల మేర 45 మీటర్లు వెడల్పున హైవే పనులు చేపడతామని వివరించారు. ఈ నెల 3 నుంచి కట్టడాలు తొలగిస్తారని తహసీల్దార్ ఎన్.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బలివాడ శంకర్, ఫ్లైఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు తిరుపతిరాజు, సత్యంనాయుడు, యుగంధర్ పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న నాయకులు, కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆప్కాస్ రద్దు, పాత ప్రైవేట్ ఏజెన్సీలకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అప్పగించడానికి 2025 ఫిబ్రవరి 6న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, సంఘం నగర అధ్యక్షుడు ఎ.గణేష్ మాట్లాడుతూ గత 17 రోజుల సమ్మె సందర్భంగా ఒప్పందాలు అమలు చేయాలని, గత ప్రభుత్వం సిఫారసుల ఫైల్స్ ఈ ఏడాది జనవరి 24న ఆర్థిక శాఖకు ఆమోదం కోసం పంపితే కూటమి ప్రభుత్వం వెనక్కి తిప్పి పంపడం దుర్మార్గమని దుయ్యబట్టారు. అనంతరం కలెక్టర్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ ఆస్తులు కాపాడాలి

శ్రీకాకుళం: ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్ , పిజీ గుప్తా, శాసపు జోగినాయుడు అన్నారు. సీనియర్ వాకర్, శ్రీకాకుళం టౌన్ ప్లానింగ్ అధికారి యామల ఉమామహేశ్వరరావు పదవీ విరమణ నేపథ్యంలో శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సత్కరించారు.

వెంకటాపురంలో చికెన్ మేళా

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకటాపురంలో వెన్‌కాబ్ సంస్థ, వెంకటేశ్వర హేచరీస్ సంస్థ, లక్ష్మీ ప్రసన్న బ్రీడ్ బెవర లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత చికెన్ అండ్ ఎగ్‌మేళా నిర్వహించారు. 300 కేజీల చికెన్, 3 వేల కోడిగుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. బర్డ్ ఫ్లూపై ప్రజల్లో అపోహలు తొలగించేందుకు కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలువురు న్యాయవాదులు హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. కార్మిక చట్టాలపై న్యాయవాది మామిడి క్రాంతి, క్రిమినల్ చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రఘురాం ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు పారా వలంటీర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని సన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 560 మంది విద్యార్థులు పాల్గొనగా 384 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రతినిధులు పి.జయరాం, పి.మురళీకృష్ణ, ఎల్.కామేశ్వరరావు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

శ్రీకాకుళం క్రైమ్ : 33 ఏళ్లు సుదీర్ఘ సేవలందించి ఉద్యోగవిరమణ పొందిన జలుమూరు ఏఎస్‌ఐ బి.లక్ష్మీనారాయణను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

జి.సిగడాం: వాండ్రంగిలో వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ ఆధ్వర్యంలో శుక్రవారం దీర్ఘకాలిక రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచులు బి.వెంకటరమణ, ఎస్. త్రినాథరావు, బి.భాస్కరరావు, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.